క్లుప్తంగా

ఫ్లై ఓవర్లకు ప్లంబింగ్ పనులు



తగరపువలస వద్ద ఫ్లై ఓవర్‌కు పైపులు అమర్చుతున్న నేషనల్ హైవే సిబ్బంది

తగరపువలస : ఐదేళ్ల క్రితం జాతీయ రహదారుల నిర్మాణ సమయంలో ఫ్లై ఓవర్లకు పూర్తి స్థాయిలో ప్లంబింగ్ పనులు చేయని సిబ్బంది ఇప్పుడు పూర్తి చేస్తున్నారు. వర్షాకాలంలో హైవే, ఫ్లై ఓవర్‌పై కురిసిన వర్షం రంధ్రాల ద్వారా సర్వీస్ రోడ్లపై ధారలుగా పడుతుండటంతో వాహనదారులు, పాదచారులు తడిచిపోతుండేవారు. దీంతో వారు ఎదుర్కొంటున్న సమస్యలను ఇటీవల పలుమార్లు జాతీయ రహదారుల సంస్థ దృష్టికి స్థానికులు తీసుకెళ్లారు. స్పందించిన అధికారులు ఇటీవల తగరపువలస నుంచి ఆనందపురం వరకు ఫ్లై ఓవర్లకు ఆనుకుని ప్లంబింగ్ పనులు మొదలుపెట్టారు. ఈ విధంగా పైపులు అమర్చడం వల్ల ఫ్లై ఓవర్లపై కురిసిన వర్షం నీరు సర్వీస్ రోడ్డుపై కాకుండా నేరుగా కిందకు దిగి డ్రైనేజీలోకి వెళ్లనుంది. దీంతో పాదచారులు, వాహనదారులు ఊపిరి పీల్చుకుంటున్నారు.

ఉపాధ్యాయునికి ఘన సన్మానం



ఉపాధ్యాయుడు శశికాంత్ దంపతులను సత్కరిస్తున్న సహచర ఉపాధ్యాయులు

మధురవాడ : చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భౌతిక శాస్త్ర ఉపాధ్యాయునిగా పనిచేసి ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన పెదపెంకి శశికాంత్ దంపతులను పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం సోమయాజులు, తదితరులు బుధవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారికి దుస్సాలువాలు కప్పి, ఆయన సేవలను కొనియాడారు. పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ శశికాంత్ విశాఖ జిల్లాలోని వివిధ పాఠశాలల్లో 37 ఏళ్ల సేవలు అందించారని కొనియాడారు. విద్యార్థులకు చక్కని విద్యా బోధనతోపాటు, క్రమశిక్షణ కలిగిన వారిగా తీర్చిదిద్దడంలో ఆయన పాత్ర విశేషమైనదన్నారు.

ఉత్సాహంగా బ్యూటీషియన్ డే



కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మురళీకృష్ణ, బ్యూటీషియన్లు

భీమునిపట్నం : భీమిలి మహిళ పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం జాతీయ బ్యూటీషియన్ డే ఉత్సాహంగా నిర్వహించారు. ఇక్కడ నిరుద్యోగ యువతులకు స్కిల్ హబ్ కింద బ్యూటీషియన్ కోర్సులో శిక్షణ అందిస్తున్నారు. శిక్షణ పొంది బ్యూటీషియన్లుగా వృత్తి చేస్తున్న వారు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్.మురళీకృష్ణ మాట్లాడుతూ ఇక్కడ శిక్షణ పొందిన వారు స్వయంగా బ్యూటీ పార్లర్లు ఏర్పాటు చేసుకుని ఉపాధి పొందుతుండడం ఎంతో సంతోషకరమన్నారు. స్కిల్ హబ్ ద్వారా ఇంకా మరింత మంది ఈ కోర్సును అభ్యసించడానికి అవకాశం ఉందని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. స్కిల్ హబ్ కో ఆర్డినేటర్ బి.అన్నపూర్ణ పాల్గొన్నారు.

వీహెచ్‌పీ ప్రఖండ నియామకం

తగరపువలస : విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ) విశాఖ మహానగర్ భీమిలి ప్రఖండను బుధవారం నియమించారు. సంతపేట రామాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా ప్రఖండ జీవీ నారాయణ పాల్గొని అధ్యక్షునిగా జీరు సత్యనారాయణ రెడ్డి, ఉపాధ్యక్షునిగా రాజారావు, కార్యదర్శిగా చిల్ల వెంకటరమణ, భజరంగదళ్ కనకల అప్పలరాజు, మాతృశక్తి బోని శారద, సత్సంగం అయినాడ హరినాథ్, కోశాధికారిగా బోనిల మురళీ శ్రీనివాసరావును నియమించారు.

మాదక ద్రవ్యాలతో జీవితాలు నాశనం



భీమిలిలో ర్యాలీలో పోలీసులు, విద్యార్థులు



భీమిలిలో ఛాత్రోపాధ్యాయుల ర్యాలీ

భీమునిపట్నం : విద్యార్థులు మాదక ద్రవ్యాలను వినియోగిస్తే జీవితాలు సర్వ నాశనమైపోతాయని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సబ్ ఇన్‌స్పెక్టర్ పి.చిన్నంనాయుడు అన్నారు. మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా స్థానిక జూనియర్ కళాశాల విద్యార్థులతో బుధవారం నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెద్దబజారు మెయిన్ రోడ్డు, గంట స్తంభం వద్ద విద్యార్థులు మానవహారం ప్రదర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చాలా మంది విద్యార్థులు తెలిసీ తెలియక ఈ వ్యసనానికి బానిసలవుతున్నారని, ఇది చాలా దురదృష్టకరమన్నారు. వ్యసనాలకు బానిసలైతే బంగారంలాంటి భవిష్యత్ కోల్పోతారన్నారు. విద్యార్థులంతా చక్కగా చదువుకుని జీవితంలో ఉన్నత స్థితికి చేరుకోవాలని సూచించారు. మాదకద్రవ్యాల విక్రయాలకు సంబంధించిన సమాచారం తెలిస్తే ధైర్యంగా తమకు తెలియజేయాలని కోరారు. కళాశాల ప్రిన్సిపాల్ సూర్యప్రసాద్, అధ్యాపకులు పాల్గొన్నారు.

- భీమిలి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదుల ర్యాలీని జడ్జిలు నాగేశ్వరరావు, సౌజన్య ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు సమాజానికి చాలా ప్రమాదకరమని, విద్యార్థులు వాటి జోలికి పోకుండా చూసుకోవాలని కోరారు. భీమిలి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎంపీ పార్వతీశం, కార్యదర్శి కె.ఎస్.ఎం.సుధాకర్, న్యాయవాదులు పి.వెంకటేష్, పి.భరద్వాజ్, ఎం.సునీల్ పాల్గొన్నారు.
- జిల్లా విద్య శిక్షణ సంస్థ (డైట్) వద్ద ప్రిన్సిపాల్ ఎం.జ్యోతి కుమారి ఆధ్వర్యంలో ఛాత్రోపాధ్యాయులు ర్యాలీ నిర్వహించారు. అధ్యాపకులు గొట్టేటి రవి, సోమయాజులు, మహాలక్ష్మి, మాధవి, త్రినాథరావు, హరిణి పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో మానవాళికి పెనుముప్పు



కార్యక్రమంలో పోలీసులు, విద్యార్థులు

కొమ్మాది : మాదక ద్రవ్యాల కారణంగా మానవాళికి పెనుముప్పు పొంచి ఉందని, ఆ మహమ్మారిని అందరూ కలిసి తరిమికొట్టాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సర్క్యులర్ ఇన్‌స్పెక్టర్ ఎస్.సరోజదేవి పిలుపునిచ్చారు. రుషికొండ గాయత్రి విద్యాపరిషత్ డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం నిర్వహించిన ప్రపంచ మాదక ద్రవ్య నివారణ దినోత్సవం కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. నేటి యువత మాదక ద్రవ్యాలకు అలవాటు పడి బంగారు భవిష్యత్ నాశనం చేసుకుంటున్నారని, ఫలితంగా కుటుంబం అంతా బాధ పడాల్సి వస్తోందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.శ్రీనివాస్ బోస్ తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో పనులు పూర్తి చేయండి

- సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ దంతులూరి వాసురాజు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ వాసురాజు

భీమునిపట్నం : భీమిలి మండలంలో జరుగుతున్న అన్ని అభివృద్ధి పనులను అధికారులు సకాలంలో పూర్తి చేయాలని ఎంపీపీ దంతులూరి వాసురాజు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద మండల ప్రజా పరిషత్ సర్వ సభ్య సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న అన్ని పనుల నిర్వహణకు ఇబ్బందులు లేవని, వాటిని కొనసాగించవచ్చని తెలిపారు. రానున్న రోజుల్లో కొత్త ప్రభుత్వం తీసుకునే నిర్ణయాల మేరకు ప్రతిపాదనలు, పనులు జరుగుతాయన్నారు. పనుల నాణ్యత విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ముఖ్యంగా ఆయా ప్రాంతాల్లో పనులు చేపట్టే ముందు సంబంధించిన సమాచారాన్ని స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులకు తప్పనిసరిగా తెలియజేయాలని, వారి సూచనలు కూడా తీసుకోవాలన్నారు. అదేవిధంగా అధికారుల దృష్టికి నాయకులు తీసుకొచ్చే సమస్యలు సత్వరమే పరిష్కరించేలా చూడాలని కోరారు. నీటి సమస్యలు ఉండే ప్రాంతాల్లో జల జీవన్ మిషన్ ద్వారా అవసరమైన మేరకు సదుపాయాలు కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి శివరాణి మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోని పిల్లలకు 80 శాతం పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశామన్నారు. మరో రెండు, మూడు రోజుల్లో మిగిలిన వారికి కూడా పంపిణీ పూర్తి చేస్తామని తెలిపారు. అనంతరం ఆయా శాఖల అధికారులు తమ శాఖల్లో జరుగుతున్న పనులను వివరించారు. వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు, ఎంపీడీవో డాక్టర్ జానకి, తహసీల్దార్ గోవింద్ పాల్గొన్నారు.

చిత్తశుద్ధితో సేవలు అందిస్తే గుర్తింపు



చిట్టివలస సబ్ పోస్ట్‌మాస్టర్ చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న సిబ్బంది

తగరపువలస : పని ఏదైనా చిత్తశుద్ధితో చేసినప్పుడే దానికి తగ్గ ప్రతిఫలాలు లభిస్తాయని ప్రముఖ సామాజిక కార్యకర్త సుంకర రామ్‌ప్రసాద్ అన్నారు. చిట్టివలస సబ్ పోస్ట్‌మాస్టర్ బోని చంద్రశేఖర్ బదిలీ సందర్భంగా బుధవారం నిర్వహించిన సన్మానసభలో ఆయన మాట్లాడారు. చంద్రశేఖర్ కింది స్థాయి నుంచి వివిధ హోదాల్లో పనిచేస్తూ ప్రజలు, అధికారుల మన్నలు పొందారన్నారు. పోస్టల్ బీమా తదితర వ్యాపార విషయంలో చిట్టివలస బ్రాంచ్‌ను భారతదేశంలోనే అగ్రస్థానంలో నిలిపారన్నారు. సన్మానగ్రహీత చంద్రశేఖర్ మాట్లాడుతూ ఉద్యోగులు సమయపాలన, నిబద్ధత, ప్రజల పట్ల సేవాభావం కలిగి ఉండాలన్నారు. అప్పుడే వారికి మన పట్ల, సంస్థ పట్ల గౌరవం, గుర్తింపు లభిస్తుందన్నారు. అనంతరం ఆయనను 21 బ్రాంచ్‌లకు చెందిన సిబ్బంది సత్కరించారు. కార్యక్రమంలో గుమస్తాలు పి.గోపాలరావు, కె.గౌరీశంకర్, పి.అప్పారావు, పి.సన్యాసిరావు, పోస్ట్‌మ్యాన్ వి.వి.రమణమూర్తి, బీపీఎంలు దుంపల ప్రభాకర్, బుగత ఈశ్వరరావు, అద్దంకి సుబ్బారావు, కె.ఎస్.ఎన్.రాజు, నరసింగరావు, బి.కనకమహాలక్ష్మి, ఏబీపీఎం తరుణ్‌కుమార్, జమ్ము శ్రీనివాసరావు, రాకేష్‌కుమార్, మేడ అప్పలరాజు, అఖిల, చిట్టితల్లి, తదితరులు పాల్గొన్నారు.

వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయం



చంద్రంపాలెంలో రోడ్డుపై వర్షం నీరు



వర్షానికి క్రికెట్ స్టేడియం వద్ద ఆగిన వాహనదారులు

మధురవాడ : వర్షంతో వాతావరణం కొంత మేర చల్లబడింది. దీంతో మధురవాడ పరిసర ప్రాంతాల వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రుతుపవనాలు ప్రవేశించినప్పటికీ ఇప్పటి వరకూ పూర్తి స్థాయిలో వర్షాలు కురవలేదు. అప్పుడప్పుడు పలకరిస్తున్న వానలతో ప్రజలు సేద తీరుతున్నారు. బుధవారం సాయంత్రం కురిసిన మోస్తారు వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడ్డారు. చిన్నపాటి వర్షం కురిసినా మధురవాడ అప్ బ్రిడ్జి, రేవళ్లపాలెం, మిథిలాపురి ఉడా కాలనీ – హైవే జంక్షన్, చంద్రంపాలెం హైస్కూలు గ్రౌండ్‌లో నీరు నిలిచిపోతోంది. అయినప్పటికీ సంబంధిత అధికారులు చర్యలు చేపట్టడం లేదని పలువురు అంటున్నారు.

వంద మందికి దంత పరీక్షలు



పెద్దిపాలెంలో దంత పరీక్షలు చేస్తున్న అనిల్ నీరుకొండ సిబ్బంది

తగరపువలస : ఆనందపురం మండలం పెద్దిపాలెంలో సంగివలస అనిల్ నీరుకొండ దంత వైద్య కళాశాల సిబ్బంది బుధవారం ఉచితంగా వంద మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సత్యం మాట్లాడుతూ దంతాలను రోజూ రెండు పూటలా శుభ్రం చేసుకోవాలని సూచించారు. గుట్కాలు, చల్లని పానీయాలు, జంక్ ఫుడ్స్‌కు దూరంగా ఉండాలన్నారు. దంతాలు శుభ్రం చేసుకోకపోతే నోటి దుర్వాసన, పిప్పి పళ్లు వంటి సమస్యలు వస్తాయన్నారు. కార్యక్రమంలో సీఎంవో ఎంఎల్‌హెచ్ అనూష, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఉప్పాడ అప్పారావు, ముదిలి చిన్నయ్య పాత్రుడు, వైద్యులు డి.సాయి పార్వతి, స్వాతి, దివ్య, నాగరాజు, సాయిగౌతమ్, ఎం.కృష్ణ, ఉప్పాడ శివ, ఆశా వర్కర్ పి.వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

సుత్తమ్మతల్లికి ప్రత్యేక అలంకరణ



ప్రత్యేకంగా పూలతో అలంకరణలో సుత్తమ్మ తల్లి

తగరపువలస : భీమిలి మండలం చిప్పాడ గ్రామదేవత సుత్తమ్మతల్లిని ఆలయ కమిటీ ప్రతినిధులు బుధవారం ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనాలు కల్పించారు. మల్లెలు, కనకాంబరాలు, బంతి పువ్వులు, తులసిమాలలు, చామంతులు, గజమాలలతో అలంకరించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

మధురవాడ : ఏపీ ట్రాన్స్‌కో మధురవాడ విద్యుత్ సబ్ స్టేషన్ రేవళ్లపాలెం 11 కేవీ ఫీడర్ పరిధిలో నిర్వహణ, మరమ్మతులు చేపడుతున్న కారణంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్‌వీఎస్ రామమూర్తి చెప్పారు. ఇందులో భాగంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు శ్రీవల్లినగర్, చంద్రంపాలెం హైస్కూల్ ఏరియా, రేవళ్లపాలెం విలేజ్, రేవళ్లపాలెం రోడ్డులోని పీఎం పాలెం పోలీస్ స్టేషన్ ఏరియా, ఉజ్వల హాస్పిటల్, భాస్కర్‌నగర్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది. వినియోగదారులు గమనించి సహకరించాలని రామమూర్తి కోరారు.

- పీఎం పాలెం సబ్ స్టేషన్ పరిధిలోని మిథిలాపురి వుడా కాలనీ, శ్రీరాం ప్రాపర్టీస్ 11 కేవీ ఫీడర్ పరిధిలో కూడా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని అధికారులు చెప్పారు. ఇందులో భాగంగా వికలాంగుల కాలనీ సమీపంలోని వేంకటేశ్వర స్వామి మెట్ట, కుషి షాపింగ్ మాల్, పాత మధురవాడ, వుడా కాలనీ మెయిన్ రోడ్డు పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది.

బోరు స్థలం కబ్జా



బీసీ కాలనీలో కబ్జాకు గురైన బోరు స్థలం

తగరపువలస : ఆనందపురం జెడ్పీ హైస్కూల్‌ను ఆనుకుని బీసీ కాలనీవాసుల దాహార్తిని తీర్చే బోరు బావి స్థలం కబ్జాకు గురైందని స్థానికులు వాపోతున్నారు. ఇక్కడే ఉన్న ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసిన ప్రబుద్ధుడు ఒకరు బహుళ అంతస్తుల భవనాన్ని నిర్మించడమే కాకుండా బోరుబావిని కూడా చెరపట్టాడు. కాలనీవాసులు అత్యవసర సమయాల్లో ఈ బోరు నీటినే వినియోగిస్తుంటారు. అంతేకాకుండా హైస్కూల్ విద్యార్థులు ఈ ప్రభుత్వ స్థలంలో తమకు ఖాళీగా ఉన్నప్పుడు ఆటలు ఆడుకుంటుంటారు. రహదారిని ఆనుకుని ప్రభుత్వ స్థలంతో పాటు బోరు ఆక్రమణకు గురైనా రెవెన్యూ, గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు స్పందించకపోవడంతో పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మామూళ్లు తీసుకుని అనుమతులు ఇచ్చారని ఆరోపిస్తున్నారు. ఆక్రమణకు తెగించిన వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని బీసీ కాలనీ వాసులు కోరుతున్నారు.

పార్కింగ్ స్టాండ్‌లా పట్టణ ఆరోగ్య కేంద్రం



పట్టణ ఆరోగ్య కేంద్రం ముందు వాహనాలు, బడ్డీ

తగరపువలస : స్థానిక డాక్టర్ వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం, జీవీఎంసీ గ్రంథాలయ పరిసరాలను కొందరు అధికారులు, సిబ్బంది పార్కింగ్ స్థలాలుగా మార్చేశారు. అద్దె ప్రాతిపదికన దుకాణాలు, టిఫిన్ షాపులకు ఇవ్వడంతో వీటిని దర్జాగా ఆస్పత్రి, గ్రంథాలయం ముందు నిర్వాహకులు నడుపుకుంటున్నారు. ఆస్పత్రికి వచ్చే రోగులు, గ్రంథాలయానికి వచ్చే పాఠకులు కనీసం ద్విచక్ర వాహనాలు నిలుపుకోవాలన్నా అవకాశం లేకుండా పోయిందని వాపోతున్నారు. చుట్టుపక్కల వ్యాపారులు కూడా కార్లను వీటికి అడ్డంగా పెట్టేసి వెళ్లిపోతున్నారు. అసలే ఇరుకైన ఈ మార్గంలో ఇష్టారాజ్యంగా వాహనాలు పార్కింగ్ చేస్తున్నా జీవీఎంసీ అధికారులకు చీమ కుట్టినట్టయినా లేకుండా పోయిందని వాపోతున్నారు. పగటివేళ భారీ వాహనాలు తగరపువలస పట్టణంలోకి ప్రవేశించే అనుమతి లేకపోయినా స్వేచ్ఛగా వాటిని నిలిపి ఉంచడం వల్ల నిత్యం ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. జీవీఎంసీ, ట్రాఫిక్ సిబ్బంది దృష్టి సారించి సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

కిటకిటలాడుతున్న కేజీహెచ్

మందుల కౌంటర్ల వద్ద రద్దీ విపరీతం



కేజీహెచ్‌లో మందులు ఇచ్చే గది వద్ద రద్దీ

మహారాణిపేట: కేజీహెచ్‌లో రోగుల సంఖ్య రోజు రోజుకూ పెరుగుతోంది. వైద్యం కోసం రోగులు అధిక సంఖ్యలో వస్తున్నారు. దీంతో వారికి మందులు ఇచ్చే కౌంటర్లు కూడా రద్దీగా ఉంటున్నాయి. గత మూడు రోజుల నుంచి మందులు ఇచ్చే కౌంటర్లు రోగులు, వారి సహాయకులతో కిటకిటలాడుతున్నాయి. ఈ రద్దీని దృష్టిలో పెట్టుకొని కేజీహెచ్ సూపరింటెండెంట్, కలెక్టర్ గతంలో కౌంటర్లు పెంచారు. ఓపీ విభాగంలో మూడు కౌంటర్లు, ఆంధ్రా బ్యాంక్ పక్కన అయిదు కౌంటర్లు ఏర్పాటు చేసి ఆధునికీకరించారు. గర్భిణులు, పిల్లలు, వృద్ధులు, కేజీహెచ్ సిబ్బందికి ప్రత్యేకంగా కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఇందులో ఫార్మాసిస్టులతో కౌంటర్లు నిర్వహిస్తున్నారు. అయినప్పటికీ గత మూడు రోజులుగా అన్ని కౌంటర్లు కిటకిటలాడుతున్నాయి. ఇక్కడి ఆస్పత్రికి ఉమ్మడి విశాఖ నుంచే కాకుండా విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లా, శ్రీకాకుళంతోపాటు ఒడిశా, ఉభయ గోదావరి జిల్లాల నుంచి రోగులు వస్తుంటారు. మందుల కోసం రోజు వారీ రోగులే కాకుండా పాత రోగులు కూడా చీటీలు తీసుకొని కౌంటర్లకు వస్తుండడంతో రద్దీ ఎక్కువగా వుంది.

ఆకట్టుకున్న భక్త నత్కీర నాటక ప్రదర్శన



నాటకాన్ని తిలకిస్తున్న సిద్ధేశ్వరానంద మహాస్వామి

సీతంపేట: శ్రీలలితా పీఠంలో జరుగుతున్న గురువుల ఆరాధనోత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం రంగస్థల కళాకారుడు, పలు నంది పురస్కారాల గ్రహీత డాక్టర్ మీగడ రామలింగస్వామి బృందం ప్రదర్శించిన భక్త నత్కీర నాటకం ప్రేక్షకులను ఆకట్టుకుంది. శ్రీకాళహస్తి మహత్యం కావ్యం ఆధారంగా మీగడ రామలింగస్వామి రచించిన ఈ నాటకంలో ఆయన నత్కీరుడు పాత్ర అద్భుతంగా పోషించారు. పాండ్య రాజుగా వి.సత్యం, నారదుడిగా డాక్టర్ అత్తిలి శంకర్, హరద్విజుడుగా ధూపం గురుమూర్తి, మహామంత్రి కె.గోపినాయుడు, మహాశివుడుగా జి.సూర్యనారాయణ, బాల శివభక్తులుగా హనీష్, సహస్ర, దాసరిగా రుద్రనారాయణ, బుడత కీచకుడిగా డాక్టర్ మోహనరావు, రాజనర్తకిగా ఎస్.సరస్వతి తదితరులు చక్కని నటనతో రసోచితమైన పద్య పఠనంతో ఆద్యంతం ప్రేక్షకులను సమ్మోహన పరిచారు. వీరికి హార్మోనియంపై మీగడ మల్లికార్జున స్వామి, డోలక్‌పై కె.బాలకృష్ణ వాద్య సహకారం అందించారు. అలంకరణ, ఆహార్యం మీరా, సత్యం చేశారు. కుర్తాళం శంకరాచార్యులు సిద్ధేశ్వరానంద భారతి మహాస్వామి సమక్షంలో జరిగిన నాటక ప్రదర్శనను పెద్ద సంఖ్యలో భక్తులు వీక్షించారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

జీవితానుభవాల నుంచే కథలు



మాట్లాడుతున్న రచయిత సుగుణరావు

సీతంపేట: రచయితకు సాంఘిక బాధ్యత ఉండాలని రచయిత డాక్టర్ ఎం.సుగుణరావు అన్నారు. సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం రాజేంద్రనగర్ ప్రిజమ్ కళాశాలలో జరిగిన కథా కచేరీలో వైవిధ్య భరితమైన కథలను రచయితలు చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కథలనేవి ఆకాశంలోంచి ఊడిపడవని, జీవితానుభవాలే కథలకు ముడిసరుకని పేర్కొన్నారు. కథా వస్తువు కోసం జీవితాన్ని, శైలి కోసం సాహిత్యాన్ని చదవాలని సూచించారు. నడుస్తున్న చరిత్రను రికార్డు చేసే సాంఘిక బాధ్యత రచయితకు ఉండాలన్నారు. పీడిత, తాడిత, దళిత, బహుజన, మహిళావాద దృష్టి కోణం నేపథ్యంలో వచ్చిన వందలాది కథలను అధ్యయనం చేసిన తర్వాతే ఔత్సాహిక రచయితలు కలం పట్టాలన్నారు. రాజకీయ సామాజిక అంశాలు, సమస్యలను ఆకళింపు చేసుకుని నిబద్ధతగా రాసే ప్రతి రచయిత మంచి సృజనకారుడు అవుతాడని చెప్పారు. సహృదయ సాహితి అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ జీవితం నుంచే కథానికలు వస్తాయని, కథాశిల్పం సరిగా లేకపోతే కథనం దెబ్బతింటుందన్నారు. సిహెచ్.చిన సూర్యనారాయణ, ఎస్.విజయ్‌కుమార్, కుప్పిలి భీమేశ్వరరావు, రామతాత, కె.వి.ఎస్.మూర్తి, పీవీఆర్ కుమారరావు, పరమేశ్వరరావు, రాధారాణి, సురేష్ తదితరులు కథా పఠనం చేశారు.

అలరించిన సంగీత విభావరి

సీతంపేట: స్వర సంగమం(హైదరాబాద్), స్వర మాధుర్యం(వైజాగ్) సంస్థల ఆధ్వర్యంలో బుధవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించిన సంగీత విభావరి అలరించింది. సంస్థ అధ్యక్షుడు డి.ఎం.రావు, కార్యదర్శి పి.వి.రఘుపతి ఆధ్వర్యంలో గాయనీ గాయకులు సినీ గీతాలను ఆలపించి ప్రేక్షకులకు వీనుల విందు చేశారు. గాయనీ గాయకులు ఆనందరెడ్డి, సంపత్‌కుమార్, శ్రియ, శశిరాణి, శైలజ మెరాజ్, మాధవి అద్భుతంగా పాటలు పాడి శ్రోతలను మెప్పించారు.

కేజీహెచ్‌లో షెడ్డు ప్రారంభం నేడు



కేజీహెచ్‌లో రోగుల సహాయకుల కోసం నిర్మించిన షెడ్డు లోపలి భాగం

మహారాణిపేట: కేజీహెచ్‌లో పిల్లల వార్డు వద్ద రోగుల సహాయకుల కోసం రూ.15 లక్షల వ్యయంతో నిర్మించిన షెడ్డును గురువారం ప్రారంభించనున్నారు. ఆస్పత్రికి వచ్చే రోగుల సహాయకులు పడే ఇబ్బందులు చూసిన అప్పటి కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున షెడ్డు నిర్మాణానికి సహకారం అందించారు. ఆస్పత్రి అభివృద్ధి నిధుల నుంచి వైద్య ఆరోగ్యశాఖ మౌలిక సదుపాయాల సంస్థ ఏఈ నాయుడు ఆధ్వర్యంలో షెడ్డు నిర్మించారు. కేజీహెచ్‌లో ఇప్పటి వరకు పలు వార్డుల్లో రోగుల సహాయకుల కోసం 10 షెడ్లు నిర్మించారు. ఇప్పుడు పిల్లల వార్డు వద్ద 11వ షెడ్డు నిర్మించారు. ఈ షెడ్డును ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ గురువారం ప్రారంభిస్తారని కేజీహెచ్ సూపరింటెంటెంట్ డాక్టర్ పి.శివానంద్ తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి కలెక్టర్ కె.మయూర్ అశోక్ పాల్గొంటారని తెలిపారు.